సందేశం

(ప్రజలకు)

**2022 సెప్టెంబర్ 21 నుండి 27 వరకు**

**పార్టీ 18వ వార్షికోత్సవాలను విప్లవోత్సాహంతో, దృఢ సంకల్పంతో నిర్వహించుకుందాం!**

# ప్రజాపునాదిని పెంచుకుంటూ ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేద్దాం!

# శత్రు వ్యూహాత్మక 'సమాధాన్'–ప్రహార్ దాడిని ఓడిద్దాం!

*పార్టీ 18వ వార్షికోత్సవ సందర్భంగా*
*పార్టీ శ్రేణులకు, విప్లవ ప్రజా నిర్మాణాలకు, విప్లవ ప్రజానీకానికి*
*సీపీఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ సందేశం!*

**కేంద్రకమిటీ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

## 2022 సెప్టెంబర్ 21 నుండి 27 వరకు

## పార్టీ 18వ వార్షికోత్సవాలను విప్లవోత్సాహంతో, దృఢ సంకల్పంతో నిర్వహించుకుందాం!

# ప్రజాపునాదిని పెంచుకుంటూ ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేద్దాం!

# శత్రు వ్యూహాత్మక 'సమాధాన్'-ప్రహార్ దాడిని ఓడిద్దాం!

**ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా!**

మన దేశ విప్లవోద్యమానికి నాయకత్వం వహిస్తున్న కార్మికవర్గ అగ్రగామి దళం, మన పార్టీ - భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఏర్పడి 2022 సెప్టెంబర్ 21వ తేది నాటికి 18 సంవత్సరాలు పూర్తి అవుతాయి. ఈ సందర్భంగా కేంద్రకమిటీ 18వ వార్షికోత్సవాలను దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణ ప్రాంతాలలో విప్లవోత్సాహంతో, దృఢసంకల్పంతో నిర్వహించుకోవాల్సిందిగా పార్టీ శ్రేణులనూ, విప్లవ ప్రజా నిర్మాణాలనూ, విప్లవ ప్రజలను కోరుతోంది. దేశవ్యాప్తంగా ప్రజా పునాదిని పెంచుకుంటూ పార్టీని శక్తివంతం చేసుకుంటూ భారత ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయాల్సిందిగా, విప్లవ ప్రతిఘాతుక వ్యూహాత్మక 'సమాధాన్'-ప్రహార్ దాడిని ఓడించాల్సిందిగా పిలుపునిస్తోంది.

మన దేశంలో కుళ్లిపోయిన అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థను ధ్వంసం చేసి, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని జయప్రదం చేయడం, ప్రపంచవ్యాప్తంగా సోషలిజం-కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో కృషి చేయడం - ఈ మహత్తర లక్ష్యాల సాధనకై దృఢసంకల్పంతో కృషి చేస్తున్న మన పార్టీనీ, విప్లవోద్యమాన్ని నిర్మూలించే ఉద్దేశంతో శత్రువు అమలు చేస్తున్న 'సమాధాన్'-ప్రహార్ దాడులను ధైర్యసాహసాలతో ఎదుర్కొంటూ ఈ సంవత్సర కాలంలో 124 మంది కామ్రేడ్స్ అమరులైనారు. వీరిలో 30 మంది మహిళా వీరయోధలు వున్నారు. ఈ అమరులలో మన కేంద్రకమిటీ, పొలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ రామకృష్ణ (అక్కిరాజు హరగోపాల్, సాకేత్), కేంద్రకమిటీ సభ్యులు, మహారాష్ట్ర-మధ్యప్రదేశ్-ఛత్తీస్‌గఢ్ ఎస్‌జెడ్‌సీ కార్యదర్శి కామ్రేడ్ దీపక్ (మిలింద్ తేల్‌తుమ్డే), డీకే ఎస్‌జెడ్‌సీ సెక్రటేరియెట్ సభ్యురాలు కామ్రేడ్ నర్మద (ఉప్పుగంటి నిర్మల), బీజే సాక్ సెక్రటేరియెట్ సభ్యులు కామ్రేడ్ రూపేష్ (సందీప్ యాదవ్), 13 మంది జెడ్‌సీ/డీవీసీ/డీసీ సభ్యులు, 30 మంది ఏసీ/పీపీసీ సభ్యులు, 25 మంది పార్టీ/పీఎల్‌జీఏ సభ్యులు, 27 మంది ప్రజా నిర్మాణాల కార్యకర్తలు ఉన్నారు. మరో 25 మంది కామ్రేడ్స్ వివరాలు అందవలసి ఉంది.

వీరితో పాటు దేశవ్యాప్తంగా బహిరంగ ప్రజా ఉద్యమాలలో పనిచేసే పలువురు విప్లవ, ప్రగతిశీల, ప్రజాస్వామిక ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, మేధావులు, విప్లవ సానుభూతిపరులు, మిత్రులు కన్నుమూసారు. పార్టీ 18వ వార్షికోత్సవ సందర్భంగా, మన పార్టీ ప్రియతమ సంస్థాపక నాయకులు కామ్రేడ్ చారుమజుందార్, కామ్రేడ్ కన్హాయ్ చటర్జీలతో పాటు, ప్రజల విముక్తి కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమరులందరికీ కేంద్రకమిటీ తలవంచి వినమ్రంగా విప్లవ జోహార్లర్పిస్తున్నది.

పెరూ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు కామ్రేడ్ గొంజాలో, ఫిలిప్పైన్స్ ఎన్‌పీఏ అధికార ప్రతినిధి కామ్రేడ్ కా ఓరిస్, గలీసియా మావోయిస్టు కమ్యూనిస్టు పార్టీ సంస్థాపక నాయకుడు కామ్రేడ్ మార్టిన్ నయాలతో పాటు పలువురు నాయకత్వ కామ్రేడ్స్ అమరత్వం అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి చాలా నష్టాన్ని కలిగించింది. కామ్రేడ్ గొంజాలో ఎంఎల్‌ఎం సిద్ధాంతాన్నీ, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను పెరూ సామాజిక పరిస్థితులకు గొప్పగా అన్వయిస్తూ అక్కడ ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయడంలో మహా నాయకుడిగా ఆవిర్భవించారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ పురోగమనానికి గొప్ప సేవలు అందించారు. ఫిలిప్పీన్స్ విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో అమెరికా సామ్రాజ్యవాదుల దిశానిర్దేశంలో దళారీ పాలకుల తీవ్రమైన విప్లవ ప్రతీఘాతుక దాడిని తిప్పికొట్టడంలో ఎన్‌పీఏ సీనియర్ కమాండర్‌గా, అధికార ప్రతినిధిగా కామ్రేడ్ కా ఓరిస్ ముఖ్యమైన పాత్ర పోషించాడు. అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమంలో మిగయిల్ అలోన్సో పేరుతో ప్రసిద్ధి చెందిన కామ్రేడ్ మార్టిన్ నయా (62) సెప్టెంబర్ 3, 2021న తీవ్ర అనారోగ్యంతో కన్నుమూసారు. ఆయన గత నాలుగు దశాబ్దాలుగా ఎంఎల్‌ఎం అరుణపతాకను ఎత్తిపడుతూ గలీసియా కార్మిక సంఘ నాయకుడిగా, ఎంఎల్‌ఎం పార్టీ నాయకుడిగా దేశీయంగా, అంతర్జాతీయంగా కమ్యూనిస్టు ఉద్యమాన్ని అభివృద్ధి చేసేందుకు అవిశ్రాంతంగా కృషి చేసారు. ఈ గొప్ప కార్మికవర్గ నాయకులతో పాటు ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగా వివిధ దేశాలలో కొనసాగుతున్న నూతన ప్రజాస్వామిక మరియు సోషలిస్టు విప్లవాలలో, వివిధ సామ్రాజ్యవాద వ్యతిరేక, జాతివిముక్తి పోరాటాలలో, ప్రజాతంత్ర, ప్రగతిశీల, దేశభక్తి ఉద్యమాలలో ప్రాణాలను త్యాగం చేసిన యోధులందరికీ కేంద్రకమిటీ అరుణాంజలి అర్పిస్తున్నది. అమరులు నెలకొల్పిన కార్మికవర్గ ఆదర్శాల నుండి ప్రేరణ పొందుతూ, వారి నిస్వార్థ త్యాగాలను ఎత్తిపడుతూ, వారు నడచిన విప్లవ మార్గంలో దృఢంగా నిలబడి అంతిమ లక్ష్యం సాధించే వైపుగా ముందుకు సాగుతూ చివరి శ్వాస వరకు పోరాడుదామని శపథం చేద్దాం.

ఈ సంవత్సర కాలంలో శత్రు 'సమాధాన్'-ప్రహార్ దాడులను వీరోచితంగా ఎదుర్కొని శత్రువు పథకాలను వమ్ము చేస్తూ, పోరాటంలో గాయపడిన వీరయోధులందరి పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తోంది. వారు త్వరగా కోలుకుని ప్రజాయుద్ధ మైదానంలోకి దుముకుతారని కేంద్రకమిటీ ప్రగాఢంగా విశ్వసిస్తోంది. ఈ కాలంలో మన పార్టీ సీనియర్ కామ్రేడ్, పొలిట్ బ్యూరో సభ్యులు,

తూర్పు రీజినల్ బ్యూరో కార్యదర్శి కామ్రేడ్ కిషన్ దా, సీసీ సభ్యులు కామ్రేడ్స్ షీలా దీ, కంచన్ దా, కృష్ణమూర్తి, జశ్‌పాల్ జీ అరెస్టులు జరిగాయి. వీరి అరెస్టులు భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పురోగమింపజేసే పనిని నెగెటివ్‌గా ప్రభావితం చేస్తున్నాయి. అనేక మంది కామ్రేడ్స్ శత్రువు చేతికి చిక్కి, చిత్రహింసలు అనుభవించి, తప్పుడు కేసులు మోపబడి, జైళ్లలో బంధించబడినారు, బిహార్, ఝార్ఖండ్‌లలో ఫాసిస్టు జడ్జీలు కొందరు కామ్రేడ్స్‌కు మరణశిక్షలు విధిస్తూ తీర్పు నిచ్చారు. వందలాది మంది కామ్రేడ్స్, విప్లవ రైతాంగ కార్యకర్తలు శిక్షలు అనుభవిస్తున్నారు, వీరంతా కారాగారాలను పోరాట కేంద్రాలుగా మార్చుతూ విప్లవ పతాకను సమున్నతంగా ఎత్తిపడుతున్నారు. ఆ కామ్రేడ్స్ అందరికీ కేంద్రకమిటీ విప్లవ జేజేలు తెలుపుతున్నది. వారు త్వరగా జైళ్ల నుండి విడుదలయ్యేలా వీలైన అన్ని ప్రయత్నాలు చేస్తామని భరోసా ఇస్తోంది.

కేంద్రకమిటీ పార్టీ 17వ వార్షికోత్సవ సందర్భంగా వివిధ ప్రాంతాల్లోని నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా శత్రు 'సమాధాన్'-ప్రహార్ దాడిని ఎదుర్కొంటూ విప్లవోద్యమాన్ని అభివృద్ధి చేసేందుకు కర్తవ్యాలను రూపొందించింది. ఈ కర్తవ్యాల సాధనలో గడచిన సంవత్సర కాలంగా విభిన్న రంగాలలో మనం సాధించిన అభివృద్ధిని, ఫలితాలను చూద్దాం.

**పార్టీ:** 2021 జనవరిలో మన కేంద్రకమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంపై ఈ సంవత్సర కాలంలో దేశవ్యాప్తంగా పై నుంచి కింది వరకు మన పార్టీ, పీఎల్‌జీఏ, విప్లవ ప్రజా నిర్మాణాలు కృషి చేసాయి. కమిటీలలో టీంవర్క్ చేయడంలో సాపేక్షికంగా మెరుగుదల సాధించాం. అయితే వ్యక్తిగత, సమిష్టి అధ్యయనంపై కేంద్రీకరించాల్సిన అవసరం ఉంది. కమిటీల పని విధానంలో ఇంకా మెరుగుదల సాధించాల్సిన, కమిటీలలో భావసమైక్యత పెంపొందించుకోవాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ఎంఎల్ఎం వెలుగులో కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని నిజమైన స్పిరిట్‌తో పరిస్థితులకు అనుగుణంగా సృజనాత్మకంగా అన్వయిస్తూ సరైన భావాలను అభివృద్ధి చేసుకునేందుకు, స్వయంవిమర్శ-విమర్శ పద్ధతిని పదునైన ఆయుధంగా వినియోగించడంలో కొంత మెరుగుదల సాధించాం. పార్టీ పంథాపై, ఎత్తుగడలపై ఆధారపడి పై నుండి కింది వరకు పార్టీ శ్రేణులన్నింటినీ, పీఎల్‌జీఏను, విప్లవ ప్రజా నిర్మాణాలను సమైక్యపరిచేందుకు, వాటిని అశేష ప్రజానీకంలోకి తీసుకెళ్లేందుకు, బలమైన సంఘటిత శక్తిగా మార్చేందుకు కొంత కృషి చేసినాం. అయితే పార్టీని సమైక్య భావం, సమైక్య కార్యాచరణలతో, క్రమశిక్షణతో తీర్చిదిద్దడంలో, పారుబోతుతనాన్ని అరికట్టడంలో కమ్యూనిస్టు విలువల్ని పెంపొందింపజేయడంలో చేయాల్సిన కృషి ఇంకా ఎంతో ఉంది.

ఈ సంవత్సర కాలంలో పార్టీ సంఘటితీకరణ క్యాంపెయిన్ కొనసాగింది. వివిధ పార్టీ కమిటీలు నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా సర్క్యులర్లు విడుదల చేసి సంఘటితీకరణ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయి. కేంద్ర కర్తవ్య సాధన కోసం శక్తిమేరకు మూడు విప్లవ అద్భుత ఆయుధాలను

పటిష్టపరుచుకోవడానికి కృషి జరుగుతున్నది. పార్టీ, ప్రత్యేకించి నాయకత్వ రక్షణకు ప్రాధాన్యత నిచ్చారు. సంఘటితీకరణలో భాగంగా కొన్ని ప్రాంతాలలో పార్టీ సభ్యత్వం కొంత పెరిగింది, కొత్త పార్టీ సెల్స్ నిర్మాణం, దెబ్బతిన్న పార్టీ సెల్స్ పునర్నిర్మాణం చేసారు. వాటిని పని చేయిస్తూ స్థానిక స్థాయిలో ప్రజాయుద్ధానికి నాయకత్వం అందించే విధంగా వాటికి శిక్షణ నిచ్చేందుకు కృషి చేసారు. వివిధ స్పెషల్ ఏరియా/స్పెషల్ జోన్/రాష్ట్రాల ప్లీనాల సమీక్షలు, కర్తవ్యాలపై తమ కేడర్లకు ఎడ్యుకేషన్ అందించారు. పార్టీ డాక్యుమెంట్లు – 'భారతదేశంలో ఉత్పత్తి సంబంధాలలో మార్పులు–మన రాజకీయ కార్యక్రమం' (ఎంఓపీ), 'భారతదేశంలో జాతుల సమస్య–మన దృక్పథం', 'కేంద్రకమిటీ రాజకీయ నిర్మాణ సమీక్ష' (సీసీ పీఓఆర్)పై ఎడ్యుకేషన్‌ను కింది వరకు అందించేందుకు వ్యక్తిగత అధ్యయనం, అధ్యయన శిబిరాలు, శిక్షణా తరగతుల ప్రక్రియ కొనసాగుతున్నది. వివిధ రూపాలలో ఈ ఎడ్యుకేషన్‌ను ప్రజా సంఘాల వరకు, ప్రజల వరకు తీసుకునిపోవాలి. ఎంఓపీ డాక్యుమెంటుపై ఆధారపడి వస్తుగత స్థితికి అనుగుణంగా ఎత్తుగడలను, అంటే వర్గపోరాట కార్యక్రమాన్ని రూపొందించుకుని సడలని దీక్షతో అమలు చేసేందుకు పార్టీ వున్న ప్రతీ ప్రాంతంలోనూ పూనుకోవాలి.

దేశవ్యాప్తంగా దళారీ పాలకవర్గాలు తీవ్రస్థాయిలో కొనసాగిస్తున్న విప్లవ ప్రతీఘాతుక, వ్యూహాత్మక 'సమాధాన్'–ప్రహార్ దాడిని పారేవా వంటి ఘటనల్లో వీరోచితంగా ప్రతిఘటిస్తూ అత్యంత ఉన్నత త్యాగ సాంప్రదాయాలను నెలకొల్పినప్పటికీ, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పని విధానంలో మార్పు తీసుకురాకపోవడం వల్ల పార్టీ చాలా తీవ్రమైన నష్టాలను పొందింది. ఈ నష్టాలను దృష్టిలో పెట్టుకుని వాటి నివారణకై 2022 జనవరిలో మన పార్టీ పొలిట్‌బ్యూరో (పీబీ) ఒక సర్క్యులర్ విడుదల చేసింది. శత్రు వ్యూహాత్మక ఎత్తుగడల పథకాన్ని అధ్యయనం చేయడంలో, అర్థం చేసుకోవడంలో, మన ఆచరణలో కొనసాగుతున్న బలహీనతలను, లోపాలను గుర్తించి సరిదిద్దుకోవడానికి, అధిగమించడానికి నిర్దిష్టంగా, సంఘటనల వారీగా కింది నుంచి సమీక్షలు జరిపి గుణపాఠాలు తీసుకోవాలని, వాటిని దృఢంగా అమలు చేయాలని పిలుపునిచ్చింది. అందుకు అనుగుణంగా పార్టీ అంతటా ఇంకా నిర్దిష్ట కృషి పెంపొందించుకోవాల్సిన అవసరం ఉంది.

పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కోబాడ్ ఘేండీ పార్టీకీ, ఎంఎల్ఎం విప్లవ సిద్ధాంతానికి, విప్లవోద్యమానికి ద్రోహం చేసి 'ఫ్రాక్చర్డ్ ఫ్రీడం–ఎ ప్రిజన్ మెమొయిర్' పేరుతో విడుదల చేసిన పుస్తకానికి జవాబునిస్తూ కేంద్రకమిటీ ఒక సైద్ధాంతిక బుక్‌లెట్ విడుదల చేసింది. కోబాడ్ పుస్తకాన్ని ఒక విద్రోహి దస్తావేజుగా ఖరారు చేసింది. ఆయనను పార్టీ నుంచి బహిష్కరించింది. పార్టీ కేంద్రకమిటీ సభ్యుడిగా ఉంటూ అరెస్టయ్యాక విప్లవ విద్రోహిగా మారిన కోబాడ్‌ను నెగెటివ్ టీచర్‌గా తీసుకోవాలని మన కేంద్రకమిటీ పిలుపునిచ్చింది.

ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమ చరిత్రలో సాంస్కృతిక రంగంలో తనదైన రీతిలో విప్లవాత్మక పాత్రను నిర్వహించిన, ప్రతిష్టాత్మక స్థానాన్ని సంపాదించుకున్న జననాట్యమండలి చరిత్రను పార్టీ

ప్రచురించింది. జననాట్యమండలి సాంస్కృతిక రంగంలో అందించిన అమూల్యమైన అనుభవాలు ఆ రంగ అభివృద్ధికీ, ఆ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు తోడ్పడగలవు.

ఈ కాలంలో సామ్రాజ్యవాదుల, దళారీ పాలకవర్గాల ప్రయోజనాలను ఈడేర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు వ్యతిరేకంగా నూతనంగా ముందుకు తెచ్చిన అనేక చట్టాలను, విధానాలను బహిర్గతపరుస్తూ మన పార్టీ వివిధ స్థాయిల్లో జోక్యం చేసుకుంది. పార్టీ ప్రచార, ఆందోళనా కార్యక్రమాలలో కొంత మార్పు వస్తున్నది. సోషల్ మీడియాను కొంతవరకు వినియోగించుకుంటున్నది. పార్టీ కేంద్ర పత్రికలను, ఆయా రాష్ట్రాల పత్రికలను సకాలంలో విడుదల చేయడంలో సాపేక్షికంగా మెరుగుదల ఉంది. పీఎల్‌జీఏ 20వ వార్షికోత్సవాల ముగింపుగా సావనీర్, అవామీ జంగ్ ప్రత్యేక సంచికతో పాటు వివిధ రాష్ట్రాల పత్రికల ప్రత్యేక సంచికలు విడుదలయ్యాయి. మన పార్టీ సంస్థాపక నాయకులలో, ఉపాధ్యాయులలో ఒకరు కామ్రేడ్ కన్హాయ్ చటర్జీ సంక్షిప్త జీవితచరిత్రను కేంద్రకమిటీ విడుదల చేసింది. ఐక్య పార్టీ ఆవిర్భావం నుంచి 2014 వరకు అమరులైన కేంద్రకమిటీ సభ్యుల చరిత్రల సంకలనం–1ని హిందీ భాషలో విడుదల చేసింది.

ఈ సంవత్సర కాలంలో మన కేంద్రకమిటీ అంతర్జాతీయ విప్లవ కార్మికోద్యమ రంగంలో వివిధ రూపాలలో తన కృషిని విస్తరించింది. 'నవంబర్ 24 యాక్షన్ డే'పై భారత ప్రజాయుద్ధ సంఘీభావ అంతర్జాతీయ కమిటీ (ICSPWI) పిలుపుకు, మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం, తదితర విప్లవ దినాలకు అంతర్జాతీయ మద్దతు కూడగట్టడానికి కృషి చేసింది. మార్చి 29 ఎన్‌పీఏ 53వ స్థాపనా వార్షికోత్సవాల సందర్భంగా ఫిలిప్పీన్స్ విప్లవోద్యమానికి సంఘీభావ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ యుద్ధంపై మన పార్టీ వైఖరిని ప్రపంచ ప్రజల ముందుంచింది. ప్రపంచ కార్మికవర్గ దీక్షా దినం 'మే డే' (మే 1) సందర్భంగా మన కేంద్రకమిటీ విడుదల చేసిన ప్రకటనపై వివిధ దేశాలలోని 13 ఎంఎల్ఎం పార్టీలు తమ ఆమోదం తెలపడంతో అది సంయుక్త ప్రకటనగా మారింది. జులై 1న భారత ప్రజాయుద్ధ సంఘీభావ అంతర్జాతీయ కమిటీ (ICSPWI) సమావేశానికి, జులై 2–3లలో జరిగిన ఎంఎల్ఎం పార్టీల అంతర్జాతీయ సమావేశానికి మన కేంద్రకమిటీ సందేశాన్ని పంపింది. మన పార్టీ డాక్యుమెంటు 'కార్మికవర్గ అంతర్జాతీయ సంస్థ నిర్మాణంపై మన పార్టీ వైఖరి'ని ఆ సమావేశాల ముందుంచింది. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, భారత ప్రజాయుద్ధానికి మద్దతుగా ఎంఎల్ఎం పార్టీలు సమైక్య కార్యాచరణకు పూనుకుంటూనే, అంతర్జాతీయ సంస్థ నిర్మాణంపై ఉమ్మడి అవగాహనను రూపొందించుకునే దిశలో కృషిని కొనసాగించాలి, మొదలైన వాటిపై ఆ సమావేశం చేసిన తీర్మానాల్ని మన పార్టీ ఎత్తిపట్టింది. మన అంతర్జాతీయ కృషి అంతటిలో భాగమైన ఐసీఎస్‌పీడబ్ల్యుఐ సంఘీభావ కృషి శ్లాఘనీయమైనది. ప్రపంచంలోని వివిధ ఎంఎల్ఎం పార్టీలు చేస్తున్న ఈ కృషి ప్రపంచ సోషలిస్టు విప్లవ శక్తుల పునఃసమీకరణకూ, సంఘటితీకరణకూ, విప్లవోద్యమాల్ని పెంపొందించడానికి తప్పక తోడ్పడుతాయి.

**పీఎల్‌జీఏ:** ఈ సంవత్సర కాలంలో మన పార్టీ నాయకత్వంలో గెరిల్లా ప్రాంతాలలో పీఎల్‌జీఏ బలగాలు భీషణ శత్రు ప్రహార్ దాడిని సాహసోపేతంగా తిప్పికొట్టడానికి తరతమ స్థాయిల్లో గెరిల్లాయుద్ధం కొనసాగించాయి. తాత్కాలిక వెనకంజ స్థితిని అధిగమించి విప్లవోద్యమాన్ని పురోగమింపజేసేందుకు తోడ్పడేలా సాపేక్షికంగా ప్రజాకృషిని పెంపొందించాయి. ప్రజలను సామ్రాజ్యవాద వ్యతిరేక, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వ్యతిరేక వర్గ పోరాటాలలోకి సమీకరించి, సంఘటితం చేయడంలో, మిలిటెంట్ ప్రజా పోరాటాలను నిర్మించడంలో క్రియాశీలంగా భాగస్వామ్యం వహించాయి. వివిధ విప్లవ ప్రజా సంఘాల, విప్లవ ప్రజా రాజ్యాధికార అంగాల నిర్మాణం–పునర్నిర్మాణానికి దన్నుగా నిలిచాయి. వివిధ పార్టీ కమిటీలు, మిలిటరీ కమిషన్ల, కమాండ్ల నాయకత్వంలో కొన్ని ప్రాంతాలలో ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్లు (టీసీఓసీ), గెరిల్లా చర్యలు నిర్వహించి కొన్ని విజయాలు సాధించాయి. ఝార్ఖండ్‌లో మనోహర్‌పూర్ ఎంఎల్‌ఏ సెక్యూరిటీ గార్డులపై దాడిలో ఇద్దరు బాడీగార్డుల నిర్మూలన, మూడు ఏకే రైఫిల్స్ స్వాధీనం, ఒడిశాలో నువాపాడ–పాతధార సర్‌ప్రైజ్ ఆంబుష్‌లో ఇద్దరు ఏఎస్ఐలతో పాటు ముగ్గురు సీఆర్‌పీఎఫ్ జవాన్ల నిర్మూలన, ఏడుగురు జవాన్లను గాయపరచడం, మూడు ఏకే రైఫిల్స్ స్వాధీనం వంటి కొన్ని ముఖ్యమైన గెరిల్లా చర్యలు జరిగాయి. దండకారణ్యంలో వివిధ గెరిల్లా చర్యలలో 9 మంది పారామిలిటరీ, స్పెషల్ పోలీసులను ఖతం చేయగా, 34 మంది పారామిలిటరీ, స్పెషల్ పోలీసులను గాయపరిచారు. గత సంవత్సర కాలంలో వివిధ గెరిల్లా ప్రాంతాలలో పీఎల్‌జీఏ బలగాలు నిర్వహించిన గెరిల్లా చర్యలలో 13 మంది పారామిలిటరీ, కమాండో, స్పెషల్ పోలీసులను నిర్మూలించి, 54 మంది పారామిలటరీ, కమాండో, స్పెషల్ పోలీసులను గాయపరిచారు. ప్రజా వ్యతిరేకులైన ఐదుగురు రాజకీయ నాయకులను, 34 మంది పోలీసు ఇన్‌ఫార్మర్లను, ఇద్దరు విప్లవ విద్రోహులను, ఒక ప్రజా శత్రువును నిర్మూలించారు. గెరిల్లాయుద్ధంలో సాధించిన ఈ విజయాలు విప్లవోత్సాహాన్ని పెంపొందించడానికి, శత్రు దాడిని ఒక మేరకు నిలవరించడానికి తోడ్పడ్డాయి.

పీఎల్‌జీఏ బలగాలను బలోపేతం చేసేందుకు వివిధ పార్టీ కమిటీలు పలు రాజకీయ తరగతులు, మిలిటరీ శిక్షణా క్యాంపులు నిర్వహించాయి. వారికి పార్టీ మౌలిక డాక్యుమెంట్లపై ప్రాథమిక అవగాహనను కల్పించే కృషి జరిగింది. వివిధ రకాల కంబాట్ స్కిల్స్‌పై, టెక్నికల్ స్కిల్స్‌పై, ఇంప్రూవైజ్డ్ ఆయుధాల వినియోగంపై వివిధ స్థాయిల్లో పీఎల్‌జీఏలోని ప్రధాన, ద్వితీయ బలగాలకు, పునాది బలగాలైన మిలీషియాకు ట్రైనింగ్ అందిస్తున్నారు. స్థానిక వనరులపై ఆధారపడి పీఎల్‌జీఏ బలగాలను సాయుధం చేయడానికి కృషి జరుగుతున్నది. ఇందులో వివిధ స్థాయిల్లో పార్టీ కమిటీలు, మిలిటరీ కమిషన్ల, కమాండ్లు, మిలిటరీ ఇన్‌స్ట్రక్టర్ టీములు, డిపార్టుమెంట్లు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. గెరిల్లా ప్రాంతాలలో ఫాసిస్టు శత్రు దాడి నుండి పీఎల్‌జీఏ బలగాలను, అనుబంధ విభాగాలను పరిరక్షించుకోవడం, బలహీనపడ్డ యూనిట్లను బలోపేతం చేయడం, నష్టపోయిన యూనిట్లను పునర్నిర్మించడం, అవసరమైన కొత్త యూనిట్లను నిర్మించడం, ఉద్యమాన్ని నిలబెట్టడం కోసం,

విస్తరించడం కోసం పార్టీ పథకం ప్రకారం కృషి చేస్తున్నది. పార్టీ–పీఎల్‌జీఏ నుండి దిగజారిపోయిన ద్రోహుల విచ్ఛిన్నకర చర్యలను అడ్డుకుంటూ పార్టీనీ, ప్రజలను, ఉద్యమాన్ని పరిరక్షించుకుంటున్నది.

**ఐక్యసంఘటన:** దేశంలో గత ఐదు సంవత్సరాలుగా కొనసాగుతున్న అనేక ప్రజా ఉద్యమాలు దేశవ్యాపిత 'ప్రజా ఉద్యమ వెల్లువ'గా రూపొందుతాయని 2021 జనవరిలో మన కేంద్రకమిటీ అంచనా వేసింది. పెల్లుబుకుతున్న ప్రజా ఉద్యమాలు ఈ అంచనా సరైందేనని రుజువు చేస్తున్నాయి. శత్రు ఫాసిస్టు నిర్బంధంలో సైతం పార్టీ నిరంతరం సాహసోపేతంగా పీడిత వర్గాల, పీడిత సెక్షన్ల ప్రచార–ఆందోళనల నిర్మాణం, వివిధ ప్రజా సంఘాల నిర్మాణం, వాటిని అభివృద్ధి చేయడం కోసం ఎక్కడిక్కడ పథకాలు రూపొందించుకుని అమలు చేసేందుకు కృషి చేసింది. వివిధ ప్రాంతాలలో సామ్రాజ్యవాదానికి, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా వర్గ పోరాటాలను నిర్మించడంలో సాపేక్షికంగా కొంత అభివృద్ధి సాధించాం. దేశవ్యాప్తంగానూ, విప్లవోద్యమ ప్రాంతాలలోనూ, కార్పొరేటీకరణ–సైనికీకరణలకు, (కార్పొరేట్ సెక్యూరిటీ విస్తరణకు) విస్థాపనలకు వ్యతిరేకంగా ప్రజలు వేలాది సంఖ్యలో కదులుతున్నారు. ఉద్యమిస్తున్న ప్రజల రాజకీయ చైతన్యాన్ని పెంపొందించడానికి మన పార్టీ అన్ని ప్రాంతాలలోనూ చొరవగా కృషి చేయాల్సిన అవసరం ఉంది.

మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా, వ్యవసాయ రంగ కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీ కేంద్రంగా ఒక సంవత్సరానికి పైగా జరిగిన రైతాంగ పోరాటంలో మన పార్టీ శక్తిమేరకు భాగమైంది. దేశంలోని కార్మికులు, విద్యార్థులు, ప్రజాస్వామిక శక్తులు, యావత్తు పీడిత వర్గాల, సెక్షన్ల, జాతుల ప్రజల మద్దతుతో రైతాంగం సమరశీలంగా కొనసాగించిన పోరాట ఫలితంగా మోదీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాల్సి వచ్చింది. ఈ పోరాట విజయం ఐక్యసంఘటనా రంగంలో మన పార్టీకి ఒక మంచి అనుభవాన్ని అందించింది.

విదేశీ బహుళజాతి కంపెనీలు, టాటా, అదానీ, అంబానీ, వేదాంత, జిందల్, మిత్తల్, ఎస్సార్, లాయడ్ వంటి దేశీయ దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ కంపెనీలు, వివిధ ప్రభుత్వాలు నిర్మించతలపెట్టిన గనులు, ప్రాజెక్టుల కోసం, వివిధ కార్పొరేట్ అనుకూల–ప్రజా వ్యతిరేక సదుపాయాల (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) నిర్మాణం కోసం, అభయారణ్యాల కోసం బలవంతంగా రైతుల భూములను, ప్రభుత్వ భూములను, హస్‌దేవ్ అరణ్యం వంటి అటవీ భూములను జప్తు చేసుకోవడానికి వ్యతిరేకంగా, బలవంతపు విస్థాపనకు వ్యతిరేకంగా, పర్యావరణ వినాశనానికి వ్యతిరేకంగా పలు పోరాటాలు కొనసాగాయి. రాజ్యహింసకు వ్యతిరేకంగా, కార్పొరేట్ కంపెనీల రక్షణ కోసం మోహరించిన లక్షలాది పోలీసు బలగాలను, క్యాంపులను ఉపసంహరించాలని, భీమాకోరేగాం వంటి పలు కుట్ర కేసులలో జైళ్లలో బంధించిన రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని, 'ఉపా' వంటి క్రూరమైన చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు

నిర్వహించడంతో పాటు విప్లవోద్యమ ప్రాంతాలలో నిరవధికంగా మిలిటెంటు పోరాటాలు పెల్లుబికాయి. ప్రత్యేకించి 'జల్-జంగల్-జమీన్'పై ఆదివాసుల, పీడిత ప్రజల అధికారం కోసం, ఆదివాసీ ప్రాంతాలలో 5వ షెడ్యూల్, 6వ షెడ్యూల్‌ను అమలు చేయాలనీ, గ్రామసభలకు అధికారాలు ఇవ్వాలనీ, మూలవాసుల-ఆదివాసుల ప్రాంతాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలని డిమాండ్ చేస్తూ, అటవీ సంరక్షణ చట్టం-1980ని నీరుగార్చే ప్రతిపాదిత సవరణలకు వ్యతిరేకంగా, ఆదివాసీ ప్రాంతాలలో 'మావోయిస్టులను నిర్మూలించే' పేరుతో విచక్షణారహితంగా జరుపుతున్న డ్రోన్ దాడులకు వ్యతిరేకంగా, 'బస్తర్‌లో నరసంహారాలు ఆపండి', 'వీటికి బాధ్యులైన పోలీసు అధికారులను కఠినంగా శిక్షించండి' అని డిమాండు చేస్తూ అనేక చోట్ల వేలాది మంది ప్రజలు పోరాడుతున్నారు. ప్రత్యేకించి దండకారణ్యంలో ఆదివాసీ ప్రజలు విశాల ఐక్యసంఘటనా వేదిక ఏర్పరచుకుని దాని ఆధ్వర్యంలో సిలింగేర్‌లో పోలీసు క్యాంపులకు, అత్యాచారాలకు, హత్యాకాండలకు వ్యతిరేకంగా మిలిటెంటు పోరాటం ఒక సంవత్సర కాలంగా నిరంతరాయంగా కొనసాగుతోంది. దీనికి మద్దతుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రమంతటా సంఘీభావ ఉద్యమం విస్తరించడమే కాకుండా దేశంలోనూ, అంతర్జాతీయంగానూ మద్దతును కూడగట్టడంలో ఒక నమూనాగా నిలిచింది. పోడుభూముల పరిరక్షణ కోసం తెలంగాణలో ఆదివాసులు సుదీర్ఘకాలంగా పోరాడుతున్నారు. అటవీ ప్రాంతాలలో ఫారెస్టు అధికారుల దాడులకు వ్యతిరేకంగా ప్రజలు కదిలారు. కొన్ని ప్రాంతాలలో అటవీ భూములు, బంజరు భూముల స్వాధీన పోరాటాలకు పార్టీ నాయకత్వం వహించింది. రైతుల సమస్యలపై ఎక్కడికక్కడ ప్రజలను పోరాటాలలోకి కదిలించింది. ఈ పోరాటాల క్రమంలో సాయుధంగా రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకునే రాజకీయాలను వేర్వేరు రూపాలలో ప్రజలకు అందించేందుకు పార్టీ కృషి చేసింది.

మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మికవర్గ వ్యతిరేక కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, బ్యాంకులు, రైల్వేలు, ఎల్ఐసీ, గనులు, స్టీల్ ప్లాంట్లు తదితర యావత్తు ప్రభుత్వ రంగ సంస్థలు, కంపెనీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, వలస-విస్థాపిత కార్మికులు-యువకులు, తదితరులు సాగిస్తున్న సమ్మెలకు, బంద్‌లకు పార్టీ మద్దతు తెలిపింది. కేరళలోని కోజికోడ్ జిల్లాలో ప్రతిపాదిత సిల్వర్ లైన్ సెమీ-హై స్పీడ్ రైల్వే కారిడార్‌కు వ్యతిరేకంగా ఐక్యసంఘటనా వేదిక నాయకత్వంలో కొనసాగుతున్న పోరాటానికి పార్టీ మద్దతు ప్రకటించింది. ఒడిశాలో నవరంగ్‌పుర్ జిల్లాలో తేల్ నదిపై ప్రతిపాదిత జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాటానికి ప్రజలు సమయాత్తం అవుతున్నారు. మహిళలు పై పోరాటాలన్నింటిలోనూ తమ వంతు భాగస్వామ్యం వహించటమే కాకుండా తమపై కొనసాగుతున్న ఘోరమైన అత్యాచారాలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలలో మిలిటెంటుగా కదులుతున్నారు. ఒడిశాలో రాయగడ జిల్లాలో స్కూల్ టీచర్ మమిత మెహర్ హత్య-శవాన్ని దగ్ధం చేసి పూడ్చిపెట్టిన సంఘటన, కేరళలో ఒక నన్‌పై రేప్ కేసులో బిషప్‌ను

కోర్టు నిర్దోషిగా విడుదల చేసిన కేసు, మొదలైన వాటికి నిరసనగా మహిళలు మిలిటెంటుగా వీధుల్లోకి వచ్చారు. ప్రజల దైనందిన సమస్యలపై, ప్రత్యేకించి ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణతో అంతర్జాతీయంగా, దేశంలో ఆకాశాన్నంటుతున్న ధరలకు వ్యతిరేకంగా పలు ప్రాంతాలలో ప్రజా ప్రదర్శనలు జరిగాయి.

మత మైనారిటీలపై, ప్రత్యేకించి ముస్లిములపై, క్రైస్తవులపై, ఆదివాసులపై, దళితులపై, మహిళలపై, విద్యార్థి, మేధావులపై బ్రాహ్మణీయ హిందుత్వ శక్తులు కొనసాగిస్తున్న అత్యాచారాలు, హత్యాకాండలకు వ్యతిరేకంగా పలు పోరాటాలు కొనసాగుతున్నాయి. దేశంలో దారిద్ర్యరేఖ దిగువన బతుకులీడుస్తున్న పేద ప్రజలు ఆహార హక్కు కోసం పోరాడుతున్నారు. దేశంలో పలు పట్టణాలలో మానవహక్కుల సంఘాలు, సామాజిక కార్యకర్తలు, ప్రముఖ ప్రొఫెసర్లు, చరిత్రకారులు, వివిధ రంగాల నిపుణులు, సామాజిక పరిశోధకులు 'ప్రజాస్వామ్య పరిరక్షణ' కోసం నిరసనలు తెలుపుతున్నారు. ప్రశ్నించే గొంతులపై 'అర్బన్ నక్సల్' ముద్ర వేసి రాజ్యం ప్రయోగిస్తున్న క్రూర నిర్బంధానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నారు. విద్యా రంగాన్ని కాషాయీకరణ, కార్పొరేటీకరణ గావించిన నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా, సార్వజనిక విద్యా హక్కు కోసం, ఆన్‌లైన్ విద్యా విధానానికి వ్యతిరేకంగా, పెద్దెత్తున పెరుగుతున్న నిరుద్యోగ సమస్య పరిష్కారానికి పలు పోరాటాలలో విద్యార్థి-యువజనులు-ఉపాధ్యాయులు కదులుతున్నారు. భారత సైన్య కాషాయీకరణ, క్యాజువలీకరణ కోసం హిందుత్వ మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న 'అగ్నిపథ్' పథకానికి వ్యతిరేకంగా నిరుద్యోగ యువత దేశవ్యాప్తంగా తిరగబడింది.

ఇలాంటి పలు పోరాటాలకు పార్టీ మద్దతు తెలపడమే కాకుండా మన పార్టీ పనిచేసే ప్రాంతాలలో వాటిలో పాల్గొనేందుకు, వాటికి నాయకత్వం వహించేందుకు కృషి చేసింది. ఈ క్రమంలో వివిధ రాష్ట్రాలలో పార్టీ నాయకత్వంలో పలు ప్రజా సంఘాలు తమ మహాసభలను నిర్వహించుకుని భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకున్నాయి. రాజకీయంగా, నిర్మాణపరంగా సంఘటితపడ్డాయి. వివిధ బహిరంగ, రహస్య ప్రజాసంఘాలు, ఐక్యసంఘటనా వేదికలు ఏర్పడి పని చేయడం కొంత పెరిగింది. పీడిత వర్గాల, సెక్షన్ల, జాతుల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వారికి నాయకత్వం వహించడం కోసం అవసరమైన అధ్యయనం, ప్రత్యేకీకరణ (స్పెషలైజేషన్)ను అభివృద్ధి చేసేందుకు పార్టీ కృషి చేస్తున్నది. రైతాంగ సమస్యలపై నిర్మాణాత్మక కృషి జరుగుతున్నది.

పార్టీ నాయకత్వంలో గెరిల్లాయుద్ధం తీవ్రస్థాయిలో కొనసాగుతున్న ప్రదేశాల్లో విప్లవ ప్రజా రాజ్యాధికార అంగాలు గ్రామ, ఏరియా, జిల్లా స్థాయిల్లో పనిచేస్తూ ప్రాథమిక స్థాయిలో ప్రజా రాజ్యాధికారాన్ని నెరుపుతున్నాయి. విప్లవ ప్రజలు ఈ ప్రజా ప్రభుత్వాలను పరిరక్షించుకుంటూ తమ భవిష్యత్తును తాము రూపొందించుకుంటున్నారు. బీజప్రాయంలో ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను ప్రజల ముందుంచుతున్నాయి. ఝార్ఖండ్, ఒడిశాలలో పంచాయితీ ఎన్నికల్ని

బహిష్కరించాల్సిందిగా పార్టీ ఇచ్చిన పిలుపును అందుకుని పలు గ్రామాలలో ప్రజలు సమస్యల ప్రాతిపదికన ఓట్లు వేయకుండా తమ నిరసన తెలియజేసారు. విప్లవ ప్రత్యామ్నాయం వైపుగా సంఘటితమవుతున్నారు.

## ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా!

అంతర్జాతీయంగా 2008 నుంచి కొనసాగుతున్న ఆర్థిక మాంద్యంలో స్వల్ప వెసులుబాటులు ఉన్నప్పటికీ సామ్రాజ్యవాద ద్రవ్య, ఆర్థిక సంక్షోభం తీవ్రమవుతూనే ఉంది. దీని నుంచి బయటపడేందుకు, ప్రపంచాన్ని తమ బలాబలాలకు అనుగుణంగా విభజించి దోపిడీ చేసేందుకు సామ్రాజ్యవాదులు ప్రపంచీకరణ విధానాలను అమలు చేస్తున్నారు. ఫలితంగా నయావలసవాద దోపిడీ మరింత పెరిగింది. ధనికులకు, పేదలకు మధ్య అంతరాలు మున్నెన్నటి కంటే ఎక్కువ పెరిగాయి. వెనుకబడిన ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలు పూర్తి పరాధీన దేశాలుగా మారిపోయాయి.

సోమాలియా, ఇథియోపియా, దక్షిణ సూడాన్, యెమెన్, అఫ్గానిస్తాన్ వంటి పలు వెనుకబడిన దేశాలలో బాహ్య, అంతర్గత సంఘర్షణలతో పాటు పర్యావరణం సంక్షోభంలో పడడంతో ప్రకృతి వైపరీత్యాలు, కోవిడ్ లాంటి ప్రమాదకర రోగాలు, ధరలు రెట్టింపు అయిన కారణంగా ప్రపంచంలో 34.5 కోట్ల మంది నిరుపేదలు ఖాళీ కడుపులతో, అర్థాకలితో, రోగాలతో బతుకుపోరులో కొట్టుమిట్టాడుతున్నారు. సామ్రాజ్యవాద ప్రాయోజిత ప్రపంచీకరణ విధానాల ఫలితంగా దళారీ దోపిడీ పాలకులు మిగిలిన కొద్దిపాటి సంక్షేమ వ్యవస్థల్ని ధ్వంసం చేస్తుండడంతో ఎంతో మంది పేద ప్రజలు దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రోజుకు 8,500 మంది పిల్లలు పోషకాహార లోపంతో మరణిస్తున్నారు. 2022-23లలో ఆకలిచావులు 1960ల తర్వాత ఎన్నడూ లేనంతగా ఉంటాయని ఒక అంచనా. పేదల ఆదాయాలు తగ్గిపోతుండగా, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి.

ఉక్రెయిన్ యుద్ధం ఈ సంక్షోభాలకు ఆజ్యం పోసింది. ప్రపంచంలోని పలు దేశాల ఆర్థిక వ్యవస్థల్ని మరింత సంక్షోభంలోకి నెడుతున్నది. అమెరికా, యూరప్ దేశాలు తమ సామ్రాజ్యవాద ప్రయోజనాలను ఈడేర్చుకోవడానికి రష్యాపై వేలాది ఆంక్షలు విధించడంతో అనేక ముఖ్యమైన ఉత్పత్తుల, ముడి పదార్థాల, ఆహార పదార్థాల సప్లయి చెయిన్ విచ్ఛిన్నం కావడంతో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రమవుతున్నది. ఇప్పటికే రష్యాలో తీవ్ర ఆర్థిక మాంద్యం ఏర్పడింది. అమెరికాలో సైతం ద్రవ్యోల్బణం 41 సంవత్సరాల రికార్డును బద్దలుకొట్టి నూతన రికార్డు నెలకొల్పింది. ప్రపంచం ఆహార సంక్షోభంలో కూరుకుపోతున్నది. నిరుద్యోగం ప్రబలుతున్నది. సామ్రాజ్యవాదులకు, దళారీ దోపిడీదారులకు ఉక్రెయిన్ యుద్ధంతో లాభాల పంట పండుతుండగా, కోట్లాది మంది పీడిత ప్రజలు ఆహార సంక్షోభానికి, లక్షలాది మంది విస్థాపనకు, లక్షలాది మంది

ఆకలిచావులకు బలవుతున్నారు. ఆర్థిక సంక్షోభంతో అతలాకుతలమైన శ్రీలంకలో దళారీ పాలకులకు వ్యతిరేకంగా అన్ని పీడిత వర్గాలకు, అన్ని మతాలకు, జాతులకు చెందిన 20 లక్షల మంది ప్రజలు, ప్రత్యేకించి మహిళలు వీధుల్లోకి వచ్చి నెలల తరబడి పోరాడారు. కార్మికులు రెండు సార్లు సార్వత్రిక సమ్మెలు నిర్వహించారు. సైన్యం, పోలీసు, న్యాయవ్యవస్థలు స్తంభించిపోయాయి. అవి ఏవీ కూడా ప్రజా ఉద్యమకారులపై బలప్రయోగం చేయడానికి సుముఖత వ్యక్తం చేయలేదు. ఈ ఆర్థిక, సామాజిక సంక్షోభం పట్ల 2022 జూన్ నెలలో జరిగిన బ్రిక్స్, జీ 7, నాటో కూటముల సమావేశాలలో సామ్రాజ్యవాద దేశాలు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించాయి. దీంతో సామ్రాజ్యవాదానికీ పీడిత జాతులకు, ప్రజలకు మధ్య వైరుధ్యం మరింత తీవ్రతరమవుతున్నది. వెనుకబడిన దేశాలలో సామ్రాజ్యవాదులకు, దళారీ పాలకవర్గాలకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు విస్తరిస్తున్నాయి. సామ్రాజ్యవాద–పెట్టుబడిదారీ దేశాలలోని కార్మికవర్గం, ప్రవాస ప్రజలపై, శ్వేతేతర జాతుల ప్రజలపై, మధ్యతరగతి ప్రజలపై కూడా దీని ప్రభావం అధికంగా ఉంది. ఈ దేశాలలో కార్మికులతో పాటు వివిధ పీడిత సెక్షన్ల దీర్ఘకాల మిలిటెంటు సమ్మెలు పెరుగుతున్నాయి.

బలహీనపడిన తన ప్రపంచాధిపత్యాన్ని పునరుద్ధరించుకోవడం కోసం అమెరికా అధ్యక్షుడు బైడెన్ అమలు చేస్తున్న ఫాసిస్టు విధానాల నిజస్వరూపం గత రెండు సంవత్సరాలలో బహిర్గతమయ్యాయి. వీటికి వ్యతిరేకంగా అమెరికా ప్రజలలో తీవ్ర నిరసనలు వ్యాపిస్తున్నాయి. ఇటీవల మహిళల గర్భస్రావ హక్కును అమెరికా సుప్రీంకోర్టు రద్దు చేయడానికి నిరసనగా మహిళల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. అఫ్గానిస్తాన్‌లో డ్రోన్‌ల ద్వారా మిసైళ్లతో దాడి చేసి అల్‌కాయిదా నేత హైదర్ అల్ జవహరీని అమెరికా హత్య చేసింది. అమెరికా తన ప్రపంచాధిపత్య భౌగోళిక రాజకీయ వ్యూహంలో భాగంగా యుద్ధ ఆర్థిక వ్యవస్థను కొనసాగిస్తూ ఉక్రెయిన్, ఇజ్రాయిల్, తైవాన్‌లను మూడు ప్రధాన కేంద్రాలుగా చేసుకుని వీటిని నాటోతో సమన్వయిస్తున్నది. ఉక్రెయిన్ యుద్ధకాండను రాజేయడంలో అమెరికా ముఖ్య పాత్ర పోషించింది. ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ యుద్ధంతో సామ్రాజ్యవాదుల మధ్య మళ్లీ ప్రచ్ఛన్న యుద్ధం మొదలైంది. అమెరికా ఇండో–ఫసిఫిక్ కేంద్రిత వ్యూహంలో భాగంగా తన అధికార ప్రతినిధి, ప్రజాప్రతినిధుల సభ మహిళా స్పీకర్ నాన్సీ పెలోసీని స్విట్జర్లాండ్, తైవాన్, జపాన్ తదితర దేశాల పర్యటనకు పంపడం ద్వారా అది చైనాతో కవ్వింపు చర్యలకు దిగింది. ఆమె పర్యటనను చైనా తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ అమెరికా పెడచెవిన పెట్టింది. పర్యవసానంగా తైవాన్ దీవి చుట్టూ చైనా, అమెరికా సైన్యాల యుద్ధ విన్యాసాలతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అమెరికా నాటో, క్వాడ్, ఆకస్ వంటి కూటములపై ఆధారపడి పునఃసంఘటితం కావడానికి ప్రయత్నించడం, రష్యా, చైనాలు ప్రతీ రంగంలోనూ పోటీకి దిగడంతో ప్రపంచవ్యాప్తంగా యుద్ధ వాతావరణం కొనసాగుతున్నది.

మన దేశంలో సామ్రాజ్యవాదుల తొత్తు అయిన హిందుత్వ ఫాసిస్టు మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రపంచీకరణ విధానాల కారణంగా రూపాయి విలువ డాలరుకు 79.65 రూపాయిలకు

దిగజారిపోయింది. దేశం రుణాల ఊబిలో కూరుకుపోతున్నది. 2014లో దేశ అప్పులు 55 లక్షల కోట్ల రూపాయలు కాగా, ఈ 8 యేళ్ల మోదీ దివాలాకోరు పాలనలో అవి 135 లక్షల కోట్ల రూపాయలకు చేరాయి. అంటే దాదాపు ప్రతి నెలా 83 వేల కోట్ల రూపాయలు అప్పులు చేస్తున్నారు. ఈ ఏడాది ప్రభుత్వం మరో 16.61 లక్షల కోట్ల రూపాయల అప్పులు చేయబోతున్నది. రూపాయి విలువ పతనం కారణంగా అప్పులు మరింత పెరుగుతున్నాయి. మూడవ వంతు అప్పులను రానున్న 9 నెలల్లో తీర్చాల్సి ఉంది. అయితే మన దేశ విదేశీ మారక ద్రవ్యం జులై 22 నాటికి 15 నెలల కనిష్ట స్థాయి 571.56 బిలియన్ డాలర్లకు తగ్గింది. అందువల్ల రుణాల చెల్లింపులకు కొత్త రుణాలు తీసుకోవడం అనివార్యం లేదా ప్రభుత్వ ఆస్తులను తెగనమ్మి చెల్లించాలి. ఇప్పటికే తెచ్చిన అప్పులపై వడ్డీ చెల్లింపులకు ప్రతీ సంవత్సరం బడ్జెట్‌లో 8.2 శాతం నిధులు ఖర్చు చేస్తున్నారు. ఇలా మోదీ ప్రభుత్వం 'ఆత్మనిర్భర్ భారత్' అంటూనే 'అప్పుల దుర్భర్ భారత్'ను, 'పరాధీన భారత్'ను ఆవిష్కరించింది. ఒక్క 2021 సంవత్సరంలోనే బడా పెట్టుబడిదారులకు 2.02 లక్షల కోట్ల రూపాయలు, వారు ఎగవేసిన రుణ బకాయిల కింద 10.75 లక్షల కోట్ల రూపాయలు చెల్లించడం ద్వారా మోదీ ప్రభుత్వం చేసిన అప్పులతో ఎవరి జేబులు నింపుతోందో స్పష్టమవుతుంది.

మోదీ పాలనలో దేశ ఎగుమతుల నుంచి వచ్చే రాబడి కంటే దిగుమతుల వల్ల అయ్యే వ్యయం పెరుగుదలతో వాణిజ్య లోటు ఆందోళనకర స్థాయికి పెరిగింది. దీంతో సాధారణ ప్రజలపై పన్నుల భారం పెరిగింది. ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ దాడితో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు గణనీయంగా పెరిగాయి. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఎరువులు, పురుగుమందుల ధరలు, వ్యవసాయ యంత్రాల ధరలు పెరిగి వ్యవసాయ ఖర్చులు పెరిగాయి. ద్రవ్యోల్బణం 15 శాతం దాటింది. కీలకమైన ఆర్థిక సూచీలన్నింటా భారతదేశం అధమ స్థాయిలో ఉంది. గత ఎనిమిదేళ్లలో రిటైల్ వృద్ధి రేటు పెరగడం లేదు. నిరుద్యోగం గణనీయంగా పెరిగింది. ఇటీవలి కాలంలో అమెరికా, యూరప్ దేశాలలో అధిక ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి సెంట్రల్ బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచుతున్నాయి. దీంతో భారత ఆర్థిక వ్యవస్థలో వృద్ధిపై నమ్మకం లేనందువల్ల విదేశీ పెట్టుబడులు మన దేశం నుంచి వెళ్లిపోతున్నాయి. వృద్ధి రేటు పెరగాలంటే మార్కెట్‌లో సరుకులకు గిరాకీ పెరగాలి. గిరాకీ పెరగాలంటే ప్రజల కొనుగోలు శక్తి పెరగాలి. ఇందుకోసం నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి, వేతనాలు పెరగాలి, పన్నులు తగ్గించాలి. మన దేశంలో ఇదే ఇప్పుడు లోపించింది.

సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ నివేదిక-2022 ప్రకారం 71 శాతం భారత ప్రజలకు కనీస పోషకాహారం (గింజ ధాన్యాలు, మాంసకృత్తులు, కూరగాయలు, పండ్లు మొదలైనవి) దొరకడం లేదు. ఫలితంగా దేశంలో యేటా 17 లక్షల మంది మరణిస్తున్నారని ఆ నివేదిక వెల్లడించింది. సంక్షేమ పథకాలలో కోతలు పెరుగుతున్నాయి. ప్రభుత్వాలు తమ బాధ్యతల నుంచి వైదొలగడం,

కార్పొరేట్ల భల్లూకపట్టులోకి పోవడంతో వైద్య, విద్యారంగాలు బలిపీఠంపైకి ఎక్కాయి. అవి ఉచిత వైద్యం పేరుతో ప్రజా ధనాన్ని కార్పొరేట్ ఆసుపత్రులకు దోచిపెడుతున్నాయి. దేశంలో సుమారు 7.8 కోట్ల ఇళ్లకు నేటికీ విద్యుత్తు సదుపాయం లేదు. జనాభాలో 33 శాతం మంది రోజుకు ఒక డాలర్ కంటే తక్కువ ఆదాయంతో బతుకులీడుస్తున్నారు. ఫలితంగా ప్రపంచ ఆకలిసూచికలో మన దేశం అత్యంత దిగువస్థాయిలో అంటే 105వ స్థానంలో, మానవ అభివృద్ధి సూచికలో 142వ స్థానంలో, ప్రపంచ సంతోష సూచికలో 139వ స్థానంలో, ప్రపంచ యూనివర్సిటీలలో మన దేశ విద్యాలయాలు దిగువ ర్యాంకుల్లో ఉన్నాయి. పేదరికం, ఆకలి లేకుండా చేయాలనీ, పౌరులందరికీ సమానావకాశాలు కల్పించాలనీ భారత రాజ్యాంగం చెబుతోంది. సంపద ఒక చోట పోగుబడకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత అని ఆదేశిక సూత్రాలు చెబుతున్నాయి. కానీ వాస్తవంలో జరుగుతున్నది అందుకు పూర్తి విరుద్ధం.

దేశంలో గత మూడు దశాబ్దాలుగా దోపిడీ ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రపంచీకరణ విధానాల వల్ల ధనవంతులు మరింత సంపన్నులుగా, పేదలు నిరుపేదలుగా మారుతున్నారు. దేశంలో 77 శాతం సంపద 10 శాతం మంది ధనికుల దగ్గర పోగుపడి ఉంది. దేశంలో సెకండుకు ఇద్దరు (అంటే ఏటా 6.3 కోట్ల మంది) దారిద్ర్యరేఖ దిగువకు జారిపోతున్నారని ఇటీవల ఆక్స్‌ఫామ్ నివేదిక వెల్లడించింది. సామ్రాజ్యవాద సృష్టి అయిన కరోనా సంక్షోభ కాలంలో ఉపాధి కోల్పోవడం, వ్యాపారాలు దివాలా తీయడం, వ్యవసాయ సంక్షోభం తీవ్రం కావడం, తదితర కారణాలతో దేశంలో 18 నుంచి 20 కోట్ల మంది ప్రజలు దారిద్ర్యరేఖ కిందికి జారిపోయారు. అదే సమయంలో దేశంలో అతి సంపన్నులు ముకేష్ అంబానీ, గౌతమ్ అడానీలతో పాటు ఎందరో పారిశ్రామికవేత్తల సంపదలు పెద్దెత్తున పెరిగాయి. ఇదే ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యంగా చెప్పుకునే మన దేశ అసలు స్వరూపం.

మోదీ ప్రభుత్వ ఫాసిస్టు విధానాల ఫలితంగా అన్ని రంగాలలో దేశ–విదేశీ కార్పొరేట్ కంపెనీల పట్టు బిగిస్తున్నది. 8 యేళ్ల పాలనలో కార్పొరేట్ కంపెనీలకు ఆటంకంగా వున్న 1800 చట్టాలను అది రద్దు చేసింది లేదా వాటికి అనుకూలంగా సవరించింది. ఉక్కు, విద్యుత్తు, బొగ్గు, డిజిటల్ కాంట్రాక్టులు, హైవేలు, రైల్వేలు, ఎయిర్‌పోర్టులు, ఓడరేవులు, ప్రభుత్వరంగ సంస్థలు, సహజ వనరులు, లక్షల కోట్ల రూపాయల రాయితీలు, బ్యాంకు రుణాల మాఫీ, ఇలా సమస్తం బహుళజాతి కంపెనీలకు, దేశంలోని అంబానీ, అడానీ వంటి బడా దళారీ పెట్టుబడిదారీ దిగ్గజాలకు దోచిపెడుతున్నది. అన్ని సెక్టార్‌లలో సంఘటిత రంగాన్ని కుదించి లేదా రద్దు చేసి, క్యాజువలీకరణను సాధారణ విధానంగా మార్చివేస్తున్నది.

అంతర్జాతీయంగా, దేశీయంగా పెరిగిన ఆర్థిక సంక్షోభం కారణంగా సామాజిక ఆర్థిక పరిస్థితులు దిగజారిపోతుండడంతో ప్రజలలో పెద్దెత్తున అసంతృప్తి వ్యాపిస్తుందని దళారీ హిందుత్వ పాలకులకు

బాగా తెలుసు. అందువల్లనే వీరి నాయకుడు మోదీ ప్రజలను మోసగించేందుకు అన్ని రకాల జిత్తులను ప్రయోగిస్తున్నాడు. 'అభివృద్ధి' గురించి డాంబికంగా వాగ్దానాలు చేస్తున్నాడు. ప్రజలను భ్రమల్లో ముంచెత్తేందుకు, హిందుత్వ ఫాసిజాన్నీ, జాతీయ దురహంకారాన్ని రెచ్చగొట్టేందుకు, సామాజికంగా వారిని నిర్వీర్యం చేసేందుకు 'దేశ సౌభాగ్యం' గురించి గారడీలు చేస్తున్నాడు. నిజానికి మోదీ ప్రభుత్వ విధానాలు ప్రజలకు, దేశానికి పూర్తిగా వ్యతిరేకమైనవి, సామ్రాజ్యవాద బ్యాంకులకు, బహుళజాతి కార్పొరేషన్లకు, బడా దళారీ నిరంకుశ పెట్టుబడిదారులకు, బడా భూస్వాములకు అనుకూలమైనవి. ఇవి దోపిడీకి పీడనలకు గురయ్యే కార్మికులు, రైతులు, మధ్యతరగతి వర్గాల, పీడిత సామాజిక సెక్షన్ల పరిస్థితులను మరింత దిగజార్చివేసాయి.

మోదీ నాయకత్వంలో బ్రాహ్మణీయ హిందుత్వ శక్తుల పాలనలో అత్యంత నిరంకుశ, ఫాసిస్టు చట్టాలను తీసుకొస్తున్నారు. వివిధ శ్రమజీవి ప్రజల, ప్రజాస్వామిక, మానవహక్కుల ఉద్యమాలపై క్రూర నిర్బంధం పెచ్చరిల్లుతున్నది. అరెస్టులు, బూటకపు ఎన్‌కౌంటర్‌లు నిరంతరం కొనసాగుతున్నాయి. దేశంలో ప్రజాస్వామిక హక్కులను అణచివేయడం సాధారణ అంశంగా మారింది. మన పార్టీతో పాటు విప్లవ ప్రజాసంఘాలను, పీడిత వర్గాలను, ప్రజా సముదాయాలను, పీడిత జాతులను, పార్లమెంటరీ ప్రతిపక్ష పార్టీలను కూడా టార్గెట్ చేస్తున్నారు. 2022లో కేవలం కశ్మీర్ ప్రాంతంలోనే 118 మంది పోరాటకారులను ప్రభుత్వ కిరాయి బలగాలు క్రూరంగా హత్య చేసాయి. బీజేపీ అధికారంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రమే కాకుండా, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, బీజేడీ, జనతాదళ్ (యు), టీఆర్ఎస్, రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్, డీఎంకే, జేఎంఎం పార్టీలు, సీపీఎం నాయకత్వంలో రివిజనిస్టు కూటమి అధికారంలో వున్న రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఫాసిజాన్ని అమలు చేయడంలో పోటీ పడుతున్నాయి. ఫలితంగా దేశంలో విచారణ లేకుండానే 76 శాతం మంది ఖైదీలు ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గుతున్నారు. ఝార్ఖండ్‌లో సాక్ సభ్యుడు కామ్రేడ్ ప్రవీర్‌కు కోర్టు ఉరిశిక్ష తీర్పు నిచ్చింది. బిహార్‌లో ఐదుగురు ఆదివాసీ, రైతు కామ్రేడ్స్‌కు ఉరిశిక్ష తీర్పు ఇవ్వగా దాన్ని తర్వాత హైకోర్టు యావజ్జీవ శిక్షగా మార్చింది. కానీ దండకారణ్యంలో గొంపాడ్‌లో 10 మంది అమాయక ఆదివాసుల హత్యాకాండకు బాధ్యులైన పోలీసులను నిర్దోషులుగా ప్రకటించిన సుప్రీంకోర్టు ఆ కేసులో ఆదివాసుల పక్షాన న్యాయం కోసం పోరాడిన గాంధీవాద సామాజిక కార్యకర్త హిమాంశు కుమార్‌పై 5 లక్షల రూపాయల జరిమానా వేసింది. అదే సమయంలో బుర్కాపాల్ కేసులో ఐదు సంవత్సరాలుగా జైలులో మగ్గుతున్న 121 మంది ఆదివాసులను నిర్దోషులుగా కోర్టు తీర్పు చెప్పి విడుదల చేసింది. కానీ, ఐదు సంవత్సరాలుగా నిర్దోషులను జైలులో నిర్బంధించినందుకు వారికి ఎటువంటి నష్టపరిహారం చెల్లించలేదు. వారిపై అక్రమ కేసు పెట్టి ఐదు సంవత్సరాలుగా జైలులో నిర్బంధించడానికి బాధ్యులైన పోలీసు అధికారులపై కోర్టు ఎలాంటి జరిమానా వేయలేదు. ఇదే దోపిడీ వర్గాల కోర్టులు సాధారణంగా అమలు చేసే వర్గ న్యాయం.

హిందుత్వ పాలకులు దేశ 'స్వాతంత్ర్య' 75వ వార్షికోత్సవాలను 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' పేరుతో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ గత సంవత్సర కాలంగా ఎంతో ఆర్భాటంగా ప్రచార క్యాంపెయిన్‌లను, సభలు, సమావేశాలను నిర్వహిస్తున్నారు. నిజానికి ఆగస్టు 15, 1947న బ్రిటిష్ వారి నుంచి వారి దళారీ పెట్టుబడిదారులు, భూస్వాముల చేతిలోకి అధికార మార్పిడి జరిగి 75 సంవత్సరాలు గడిచిపోయాయి. కానీ ఇప్పటి వరకు ప్రజల ఏ ఒక్క మౌలిక సమస్యా పరిష్కారం కాలేదు. ప్రజల బతుకుల్లో పెద్ద మార్పు ఏదీ రాలేదు. పేదరికం, ఆకలిచావులు, దారిద్ర్యరేఖ దిగువున వున్న నిరుపేదల సంఖ్య పెరుగుతున్నాయి. సామ్రాజ్యవాద కార్పొరేటీకరణ, సామ్రాజ్యవాద ప్రాయోజిత వికృత పారిశ్రామిక, వ్యవసాయ విధానాల ఫలితంగా దేశం పూర్తిగా పరాధీన దేశంగా మారింది. సామ్రాజ్యవాద కార్పొరేటీకరణ ద్వారా పెంపొందుతున్న గాలిబుడగ లాంటి అభివృద్ధిని చూపి ప్రభుత్వాలు ప్రజలను భ్రమల్లో ముంచేందుకు ప్రయత్నిస్తున్నాయి. నిజానికి సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, బడా భూస్వామ్య వర్గాలతో కూడిన విప్లవ ప్రతిఘాతుక కూటమి దేశంలో ఉత్పత్తి శక్తుల అభివృద్ధిని అడ్డుకుంటున్నది. దేశంలో స్థిరమైన అభివృద్ధికి పెద్ద ఆటంకంగా ఉంది. ఫలితంగా పారిశ్రామిక, వ్యవసాయ రంగాలు సంక్షోభంలో కూరుకుపోయాయి. రైతులు భూములమ్ముకుని కౌలు రైతులవుతున్నారు లేదా రైతుకూలీలవుతున్నారు. కూలీ పని కూడా దొరక్క పొట్టచేత పట్టుకుని వలస పోవడం బాగా పెరిగింది. బహుళజాతి కంపెనీలు, దళారీ పెట్టుబడిదారులు వివిధ పరిశ్రమల్లో ఉపాధిని హరించివేసే టెక్నాలజీలను ప్రవేశపెడుతుండడం, సంఘటిత రంగాన్ని కుదించివేస్తుండడంతో కార్మికుల, ఉద్యోగుల ఉపాధికి ఎలాంటి భద్రత లేకుండాపోయింది. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాచివేసారు. పోరాడే ప్రజలపై ప్రభుత్వ సాయుధ బలగాల ఫాసిస్టు దాడి పెరుగుతున్నది. దేశాన్ని సైనికీకరిస్తున్నారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యంగా చెప్పుకునే ఈ దేశంలో ప్రజలకు ఏ విధమైన మౌలిక స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు లేవు. మాట్లాడే హక్కు, సమావేశ హక్కు, సంఘ నిర్మాణ హక్కు, నిరసన ప్రకటించే హక్కు, విద్యా హక్కు, ఆహార హక్కు, ఉపాధి హక్కు, ఆవాస హక్కు, చివరికి దేశంలో జీవించే హక్కు కూడా లేవు. దేశ రాజ్యాంగంలో రాసుకున్న చట్టాల, ఆదేశిక సూత్రాల అమలు ఊసేలేదు. నిరుద్యోగాన్ని, పేదరికాన్ని పెంచే టెక్నాలజీలపై ఆధారపడి సాధించిన దాదాపు 3 ట్రిలియన్ డాలర్ల స్థూల జాతీయ ఉత్పత్తిని చూపుతూ దీనినే దేశాభివృద్ధిగా ఆధునిక గోబెల్స్ మోదీ అలుపుసొలుపు లేకుండా ప్రచారం చేస్తున్నాడు. ఇంత అభివృద్ధి నిజంగా జరిగితే దేశంలో కూడు, గూడు, గుడ్డ, తాగునీరు, విద్య, వైద్యం, భూమి, సాగునీరు, ఉపాధి లేమితో ప్రజల బతుకులు దుర్భరంగా ఎందుకు మారాయి? కోట్లాది మంది ప్రజలకు ఒక్కపూట కూడా తిండి తినలేని స్థితి ఎందుకు ఏర్పడింది? ఈ 'ప్రజాస్వామ్య' దేశంలో నిరసన తెలిపే హక్కుతో పాటు ఎలాంటి రాజకీయ హక్కులు ఎందుకు లేవు?

మోదీ దృష్టిలో అభివృద్ధి అంటే సామ్రాజ్యవాద నయావలసవాద దోపిడీని, దళారీ పెట్టుబడిదారీ, భూస్వామ్య దోపిడీని పెంచడం తప్ప మరేమీ కాదు. అందువల్ల 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా మోదీ నేతృత్వంలో హిందుత్వ పాలకులు చెబుతున్న 'న్యూ ఇండియా'ను ఆహ్వానించడం అంటే, దేశాన్ని సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకు ధారాదత్తం చేయడమే అవుతుంది. ఘరానా హంతకులను, అవినీతిపరులను నిర్దోషులుగా ప్రకటించి, వారిని పరిరక్షించడమే అవుతుంది. దేశంలో ప్రముఖ ప్రజా నాయకుల, నాయికల గొంతు నులిమి నిరవధికంగా జైలులో నిర్బంధించడమో లేదా హత్య గావించడమో అవుతుంది. అదే సమయంలో అమాయకులు దోషులుగా చిత్రీకరించబడతారు. సామాజిక కార్యకలాపాలు సాగించడం, మానవహక్కుల కోసం పోరాడడం, సత్యం మాట్లాడడం నేరమవుతుంది. ఇక్కడ ముస్లిముల, ఆదివాసుల, దళితుల, మహిళల జీవితాలకు విలువ లేకుండా పోతుంది. ఈ దేశంలో పేదలుగా పుట్టడం శాపం అవుతుంది. తమ సామ్రాజ్యవాద, దళారీ కార్పొరేట్ ప్రభువులకు అవసరమైన భూమి, విద్యుత్తు, అమూల్యమైన లోహ మూలకాలు, నీరు, కలప కోసం పర్వతాలు, అడవులు లేకుండా అస్తిత్వమే లేని ఆదివాసుల జీవితాలను నిరాఘాటంగా బలి చేయడం న్యాయమవుతుంది. దాడులు, వేధింపులు, చిత్రహింసలు, అమాయకుల ప్రాణాల హననం కొనసాగుతుంది. ఇదే 'న్యూ ఇండియా' అసలు స్వరూపం. న్యూ ఇండియాను సాధించేందుకే భారత సైన్యాలను కాషాయీకరించి, ఫాసిజీకరించే 'అగ్నిపథ్' పథకం రూపొందింది. టాటా కంపెనీ ప్రభుత్వ సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా నూతన పార్లమెంటు భవనంపై ప్రతిష్టించే నాలుగు సింహాలు క్రూరంగా, కోరలు చాచి ఈ ఫాసిస్టు దాడికి సంకేతం కానున్నాయి. వాటి నోళ్లు ఈ దేశాన్ని యుద్ధపిపాసుల భూమిగా మార్చేయాలన్న తలంపును వెల్లడిస్తున్నాయి. సామ్రాజ్యవాద నయావలసవాదులకు దాస్యం చేసే హిందుత్వ దళారీ పాలకవర్గాల నుంచి అర్ధవలస, అర్ధభూస్వామ్య భారతదేశాన్ని విముక్తి చేయడం ద్వారా పీడిత ప్రజలు, సెక్షన్లు, జాతులు స్వేచ్ఛా వాయువులు పీల్చగలుగుతారు. అప్పుడు మాత్రమే నిజమైన నయా భారతదేశాన్ని, ప్రజల ప్రజాస్వామిక భారతదేశాన్ని, నూతన ప్రజాస్వామిక భారతదేశాన్ని చూడగలుగుతారు.

### ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా!

దోపిడీ, పీడన, అణచివేత, వివక్ష ఉన్నంత వరకూ వివిధ పీడిత వర్గాల, సెక్షన్ల, జాతుల ప్రజల వర్గ పోరాటం, ప్రజాస్వామిక పోరాటాలు, జాతి విముక్తి పోరాటాలు, విప్లవాలు కొనసాగుతూనే ఉంటాయి. పాలకవర్గాలు, వారి రాజ్యం ప్రతీ రోజూ ప్రజలపై హత్యాకాండలు, అత్యాచారాలు, చేస్తూ, వారిని అవమానాల పాల్జేస్తూ వారు తిరగబడేలా పురికొల్పుతున్నది. కనుక విప్లవాలను శాశ్వతంగా అడ్డుకోవడం పాలకవర్గాల వల్ల, వారి రాజ్యం వల్ల కాదు. మన పార్టీ సామాజిక విప్లవాల పట్ల మార్క్సిస్టు అవగాహనతో, అంచంచల విశ్వాసంతో నేటి అనుకూల వస్తుగత పరిస్థితులను పూర్తిగా వినియోగించుకుంటూ అననుకూలతల నుంచి బయటపడేందుకు చొరవగా మార్గాలను

శోధించాలి. ఒక్కొక్కచోట ఉండే ఒక్కొక్క అనుకూలతను గుర్తించాలి. శత్రుదాడిని తట్టుకొని నిలబడాలంటే అనుకూలతలను సమర్ధవంతంగా వినియోగించుకుంటూ, బలహీనతలను, తప్పులను సరిదిద్దుకుంటూ, చొరవను మన చేతిలో నిలబెట్టుకోవాలి. ప్రజలను రాజకీయంగా జాగృతం చేస్తూ వర్గ పోరాటాలను, ప్రజా పోరాటాలను అభివృద్ధి చేయాలి. మార్క్స్, ఎంగెల్స్‌లు శాస్త్రీయ విప్లవ సిద్ధాంతం 'మార్క్సిజాన్ని' ప్రపంచ కార్మికవర్గానికి, సకల దేశ శ్రామికులకు అందించారు. లెనిన్, స్టాలిన్‌లు బోల్షివిక్ పార్టీని శత్రువుకు అభేద్యమైన, ఉక్కులా పదునెక్కిన రీతిలో నిర్మించి, సోషలిస్టు విప్లవాన్ని జయప్రదం చేసి, సోషలిస్టు రాజ్యాన్ని స్థాపించారు. మావో ప్రజలకు సేవ చేయడం ఎలాగో, నూతన ప్రజాస్వామిక రాజ్యాన్ని-సోషలిజాన్ని స్థాపించడం ఎలాగో, దీన్ని పరిరక్షించడం కోసం సాంస్కృతిక విప్లవం చేయడం ఎలాగో నిరూపించి చూపారు. ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకుని వర్గ పోరాట జ్వాలలను సృష్టించడానికి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం పెద్దెత్తున మాస్‌వర్క్ చేయడం తప్పనిసరి అవసరం. పీడిత వర్గాల, సెక్షన్ల, జాతుల ప్రజలను రాజకీయంగా జాగృతం చేసి సంఘటితం చేయకుండా, వర్గ పోరాట జ్వాలల్ని రగిలించకుండా పార్టీ-పీఎల్‌జీఏ-ఐక్యసంఘటన బలోపేతం కావు, విప్లవ విజయం ఉండదు, కార్మికవర్గ అంతర్జాతీయ కర్తవ్యాలను సమరశీలంగా నిర్వహించలేం. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా సమీకరణ, పోరాటాలు, శత్రుదాడికి వ్యతిరేకంగా ప్రజా ప్రతిఘటన-సాయుధ ప్రతిఘటన, ప్రజాయుద్ధం లేకుండా ప్రజా విజయాలను వేటినీ కాపాడుకోలేం. దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథా ద్వారానే అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థను ధ్వంసం చేసి సాయుధ వ్యవసాయక విప్లవం ఇరుసుగా కలిగిన నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయగలం. తద్వారానే దోపిడీ పీడన అణచివేత వివక్షలకు తావులేని నూతన ప్రజాస్వామిక భారతదేశాన్ని స్థాపించగలుగుతాం. ఈ అవగాహనతో ఆత్మవిశ్వాసంతో దృఢంగా ముందుకు సాగుదాం!

☆ దండకారణ్యం, బిహార్-ఝార్ఖండ్, తూర్పు బిహార్-ఈశాన్య ఝార్ఖండ్‌లను విముక్తి ప్రాంతాలుగా చేసే లక్ష్యంతో పని చేయండి!

☆ ప్రజాపునాదిని పెంపొందించండి!

☆ పార్టీనీ, పీఎల్‌జీఏ, విప్లవ ప్రజా నిర్మాణాలను బలోపేతం చేయండి!

☆ సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వ్యతిరేక వర్గ పోరాటాన్ని తీవ్రతరం చేయండి!

☆ గెరిల్లాయుద్ధాన్ని-ప్రజాయుద్ధాన్ని విస్తృతం-తీవ్రతరం చేయండి!

☆ శత్రు వ్యూహాత్మక 'సమాధాన్'-ప్రహార్ దాడిని ఓడించండి! విప్లవోద్యమాన్ని పురోగమింపజేయండి!

☆ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా మిలిటెంటు పోరాటాలు నిర్మించండి!

☆ బూటకపు 'న్యూ ఇండియా' కాదు! నూతన ప్రజాస్వామిక ఇండియా కావాలి!

☆ కార్మికవర్గ అంతర్జాతీయత వర్ధిల్లాలి!

☆ మార్క్సిజం–లెనినిజం–మావోయిజం వర్ధిల్లాలి!

☆ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) వర్ధిల్లాలి!

**విప్లవాభినందనలతో**

**కేంద్ర కమిటీ**

**తేదీ : అగస్టు 13, 2022** **భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**